# జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

సోమవారం 10-08-2026

సంపుటి 1 సంచిక 258

పేజీలు : 04


వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195









రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని

## పూజలు

**బోనాల వేళ అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్..**

**దశ, హైదరాబాద్:** బోనాల పండుగ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నగరంలోని పలు ప్రముఖ అమ్మవారి ఆలయాలను ఆదివారం దర్శించుకున్నారు. శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారిని, లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో వ్యాపారాలు మరింత అభివృద్ధి చెందాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులందరూ సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కేటీఆర్ తెలిపారు. అనంతరం ఓల్డ్‌సిటీలోని బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయం, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, నాంపల్లిలోని శ్రీ ఏడు గుళ్ల

..మిగతా 4వ పేజీలో →

# వృద్ధులే టార్గెట్

## 19 నెలల్లో రూ.102 కోట్ల సైబర్ మోసాలు



**దశ, హైదరాబాద్:** సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు భారీగా మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. 2025 జనవరి నుంచి 2026 జూలై 31 వరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల పరిధిలో వృద్ధులకు సంబంధించిన 403 కేసులు నమోదయ్యాయని, బాధితులు మొత్తం రూ.102.02 కోట్లు నష్టపోయారని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన సీపీ సజ్జనార్ సైబర్ మోసాల వివరాలను వెల్లడించారు. ట్రేడింగ్ ఫ్రాడ్‌లలోనే 113 కేసులకు సంబంధించి రూ.55.88 కోట్లు నష్టపోయారని తెలిపారు. వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, భారీ లాభాల పేరుతో సైబర్ నేరగాళ్లు వృద్ధులకు వల వేస్తున్నారని చెప్పారు. నకిలీ యాప్‌లలో లాభాలు వచ్చినట్లు చూపించి, మరింత పెట్టుబడి పెట్టేలా చేసి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. పోలీస్, సీబీఐ, ఈడీ, కస్టమ్స్ అధికారులమంటూ వీడియో కాల్స్ చేసి డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ తరహా మోసాల్లో 69 కేసులు నమోదై రూ.31.93 కోట్లు నష్టపోయినట్లు చెప్పారు. ఓటీపీ మోసాల్లో 115 కేసులు నమోదు కాగా రూ.4.94 కోట్లు పోగొట్టుకున్నారని తెలిపారు. ఆకర్షణీయమైన వడ్డీలు, అధిక రాబడుల పేరుతో పెట్టుబడి మోసాలు చేస్తున్నారని, ఇలాంటి 22 కేసుల్లో రూ.2.79 కోట్లు నష్టపోయినట్లు వెల్లడించారు. సోషల్ మీడియా, డేటింగ్ యాప్‌ల ద్వారా పరిచయాలు పెంచుకుని వృద్ధుల ఒంటరితనాన్ని సైబర్ నేరగాళ్లు ఆసరాగా చేసుకుంటున్నారని సజ్జనార్ తెలిపారు. డేటింగ్ ఫ్రాడ్, హనీట్రాప్ కేసుల్లో 7 కేసులకు సంబంధించి రూ.70.11 లక్షలకు పైగా నష్టపోయారని చెప్పారు. గిఫ్టులు, కస్టమ్స్ డ్యూటీ, అత్యవసర ఖర్చుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. 2025లో 285 కేసుల్లో రూ.71.81 కోట్లు, 2026 తొలి ఏడు నెలల్లో 118 కేసుల్లో రూ.30.20 కోట్లు నష్టపోయినట్లు సీపీ వివరించారు. పోలీసుల

..మిగతా 4వ పేజీలో →

## జీహెచ్ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కు భారీ స్పందన

### 7,340 ఇళ్లకు 35,125 దరఖాస్తులు

**దశ, హైదరాబాద్ :** జీహెచ్ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ పథకానికి భారీ స్పందన లభించింది. 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న 7,340 ఇళ్లకు ఇప్పటికే 35,125 దరఖాస్తులు వచ్చినట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పీ. గౌతం తెలిపారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 10 వరకు మాత్రమే గడువు ఉందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



**20న లాటరీ**

దరఖాస్తుదారులకు ఇళ్ల కేటాయింపు కోసం ఆగస్టు 20న లాటరీ నిర్వహించనున్నట్లు గౌతం తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు ఏడాది లోపు ఇళ్లను అందజేస్తామని వెల్లడించారు. ఇళ్ల కేటాయింపు జరగని దరఖాస్తుదారులకు వారు చెల్లించిన రూ.10 వేల ధరావతు రుసుమును తిరిగి చెల్లిస్తామని స్పష్టం చేశారు. భారీ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల్లో ఆసక్తి నెలకొంది.



## మావోయిజం దాదాపు అంతం..

**పోలీసు శాఖలో సమూల సంస్కరణలు: డీజీపీ సీవీ ఆనంద్**

**దశ, వరంగల్:** తెలంగాణలో మావోయిజం, నక్సలిజం దాదాపు పూర్తిగా అంతమైందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కర్రెగుట్టలు, మరికొన్ని ప్రాంతాల్లో ఇంకా మావోయిస్టులు ఉన్నప్పటికీ.. ప్రధాన కేడర్ మొత్తం లొంగిపోయిందని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం, పోలీసు శాఖ చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ఆదివారం వరంగల్ జిల్లాలో పర్యటించిన డీజీపీ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ములుగులో లొంగిపోయిన మావోయిస్టులతో సోమవారం మాట్లాడనున్నట్లు తెలిపారు. మావోయిస్టు కుటుంబాలను ఆదుకునేందుకు కూడా పోలీసు శాఖ తరఫున ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. తన ఐపీఎస్ ప్రస్థానం వరంగల్ నుంచే ప్రారంభమైందని గుర్తుచేసుకున్న

..మిగతా 4వ పేజీలో →



## కోట్ల పనికి.. నాణ్యత తిలోదకాలు!



**ట్రంక్‌లైన్‌లో ఇసుకకు బదులు డస్ట్?**

**కోట్ల రూపాయల పనుల్లో నిబంధనలు గాలికి.. పర్యవేక్షణకు అధికారులేరీ?**

**దశ, పెద్ద అంబర్‌పేట:** ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడాల్సిన కోట్ల రూపాయల విలువైన ట్రంక్‌లైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? పనులు జరుగుతున్న తీరుపై స్థానికులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పెద్ద అంబర్‌పేట నుంచి పసుమాముల మీదుగా మూసీలో కలిపే ట్రంక్‌లైన్ పనుల్లో నిర్మాణ సామగ్రి వినియోగం, నాణ్యతపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుకకు

..మిగతా 4వ పేజీలో →

## రెంట్ బాయ్‌ఫ్రెండ్ ట్రాప్

**అమ్మాయిలూ బీ కేర్‌ఫుల్!.. ఆన్‌లైన్‌లో కొత్త సైబర్ మోసం**

సోషల్ మీడియాలో సైబర్ కేటుగాళ్ల కొత్త ఎత్తు.. 499కే బాయ్‌ఫ్రెండ్.. నమ్మితే డబ్బులు గుల్లే!

**దశ, హైదరాబాద్:** ఒంటరితనంతో బాధపడుతున్నారా.. మీతో కాఫీ తాగడానికి, సినిమాకు వెళ్లడానికి అందమైన అబ్బాయి కావాలా? అదీ 50 శాతం ఆఫర్‌తో అంటూ సోషల్ మీడియాలో కనిపిస్తున్న ఆకర్షణీయమైన పోస్టర్లను నమ్మితే సైబర్ మోసగాళ్ల బారిన పడే ప్రమాదం ఉందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ సజ్జనార్ హెచ్చరించారు. అమ్మాయిలు, యువతులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు కొత్త తరహా డేటింగ్ ట్రాప్‌కు తెరతీశారని ఆయన తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో 'రెంట్ బాయ్‌ఫ్రెండ్', 'యువర్ పర్సనల్ కంపానియన్' పేరుతో

..మిగతా 4వ పేజీలో →



## పెద్ది కుటుంబానికి కేసీఆర్ భరోసా

**2.25 కోట్ల ఆర్థిక సాయం**



# వైఎంసీఏ క్రీడా విజేతలకు బహుమతుల ప్రదానం



**దశ, హైదరాబాద్ :** వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన 26వ వార్షిక 'కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ 2026' క్రీడా విజేతలకు సిఎస్ఐ వెస్లీ చర్చి ప్రెస్బిటర్ ఇన్చార్జ్ రెవ. డాక్టర్ టి. భాస్కర్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యార్థులకు ఖోఖో, బాస్కెట్బాల్, వాలీబాల్, కబడ్డి, తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. విద్యార్థులు చదువుపై ఎంత శ్రద్ధ వహిస్తారో అదే స్థాయిలో క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ పి.జోనథన్ ధర్మరాజు, ఉపాధ్యక్షుడు జిఎం దీన్ దయాల్, బోర్డు సలహాదారు బిజె వినయస్వరూప్, కో ఆర్డినేటర్ బి. ఇమ్మాన్యుయేల్, ప్రధానకార్యదర్శి ప్రిస్ట్ గైస్, భవాని, తదితరులు పాల్గొని విజేతలైన క్రీడాకారులను అభినందించారు.

# ఏఎస్ఐ కె. రమేశ్‌కు ఎస్ఐగా పదోన్నతి




**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఏఎస్ఐ)గా విధులు నిర్వహిస్తున్న కె. రమేశ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్ఐ)గా పదోన్నతి పొందారు. పోలీస్ శాఖలో విధినిర్వహణ, సేవలను పరిగణనలోకి తీసుకుని ఆయనకు ఈ పదోన్నతి లభించింది. ఏఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన రమేశ్ తాజాగా ఎస్ఐగా ప్రమోషన్ పొందడంతో సహచర పోలీసు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఐగా కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

# ఉత్తమ అధికారిగా ఎం. మౌనికకు అవార్డు



**దశ, చింతపల్లి:** చింతపల్లి మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. మౌనిక ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ వ్యవసాయ రంగానికి అందిస్తున్న సేవలను గుర్తించి ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గావేజ్ ఆర్గానిక్స్ చైర్మన్ సి హెచ్ వి గణేష్ మౌనికను ఘనంగా సన్మానించి, అవార్డు అందుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆకాంక్షించారు. ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న ఎం. మౌనికకు పలువురు అధికారులు, రైతులు, ప్రజలు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# చింతల్ బస్తీలో బోనాల వేడుకల్లో పాల్గొన్న రైల్వే జెఏసి నేత తుంగ లక్ష్మణ్; వైభవంగా బోనాలు



**దశ, ఓయూ:** తార్నాక చింతల్ బస్తీలో ఆషాడమాసం బోనాల జాతర వేడుకలు వైభవంగా నిర్వహించారు. బస్తీలోని మహిళలంతా స్థానికంగా ఉన్న అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైల్వే జెఏసి నాయకులు తుంగ లక్ష్మణ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమంలో బస్తీ వాసులంతా నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

# వైభవంగా ఆషాడ మాస బోనాలు



**దశ, ఓయూ:** తెలంగాణ ఆషాడ మాసంలో జరుపుకునే బోనాల పండుగకు దేశ,విదేశాలలో మంచి ఆదరణ ఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి పాక స్వామి అన్నారు. బోనాల పండుగ సందర్భంగా ఆదివారం గోల్నాక చర్చి లైన్ లోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారికి బోనం భారీ తొట్టెలను సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి, దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, ఆంధ్రపు శ్రీనివాస్, స్వాతి, స్వామి కృష్ణ, మహేందర్ తో పాటు అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై అధికారులకింత 'ప్రేమ' ఎందుకో?




## ఆర్టీఐలో సమాచారం అడిగితే 'థర్డ్ పార్టీ' సమాధానం

## కవాడిపల్లి గ్రామపంచాయతీ తీరుపై విమర్శలు



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులే వాటి వివరాలను బయటకు చెప్పేందుకు ఎందుకు వెనుకాడుతున్నారనే ప్రశ్నలు కవాడిపల్లి గ్రామపంచాయతీలో చర్చనీయాంశంగా మారాయి. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద గ్రామంలో అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వివరాలు కోరితే.. 'థర్డ్ పార్టీ సమాచారం' అంటూ సమాధానం ఇవ్వడంపై స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. గత ఏడాది గ్రామంలో అనుమతులు లేకుండా ఎన్ని భవనాలు నిర్మించారు? వాటిపై ఎన్ని నోటీసులు జారీ చేశారు? ఎన్ని నిర్మాణాలపై చర్యలు తీసుకున్నారు? ఎన్ని కూల్చివేశారు? బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? వంటి కీలక వివరాలను ఆర్టీఐ ద్వారా కోరినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రశ్నలకు పూర్తి వివరాలు ఇవ్వకుండా సెక్షన్-11ను ప్రస్తావించడం ఇప్పుడు విమర్శలకు దారితీస్తోంది.

### అక్రమ నిర్మాణాలపై చర్యలెక్కడ?

గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు లేవంటే ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పొచ్చని, ఉంటే వాటిపై తీసుకున్న చర్యల వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు నిజంగానే కఠినంగా వ్యవహరిస్తుంటే.. వాటి సంఖ్య, జారీ చేసిన నోటీసులు, తీసుకున్న చర్యల వివరాలను వెల్లడించేందుకు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### ఉన్నతాధికారులు స్పందిస్తారా?

ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), రాష్ట్ర సమాచార కమిషన్ స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఇచ్చిన సమాధానం చట్ట నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో సమగ్రంగా పరిశీలించాలని కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు నిజంగా చర్యలు తీసుకుంటున్నారా? లేక ఆర్టీఐ ప్రశ్నలకు 'థర్డ్ పార్టీ' పేరుతో సమాధానాలు తప్పించుకుంటున్నారా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

### ఆర్టీఐకి 'థర్డ్ పార్టీ' అడ్డంకా?

ప్రజాధనంతో, ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన గ్రామపంచాయతీ పరిపాలనలో అక్రమ నిర్మాణాలపై తీసుకున్న చర్యల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్టీఐ చట్టంలోని నిబంధనలను చూపిస్తూ సమాచారాన్ని నిరాకరించడం ద్వారా అసలు అంశాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలకు సంబంధించిన సమాచారం ఏ మేరకు 'థర్డ్ పార్టీ సమాచారం' పరిధిలోకి వస్తుంది? సెక్షన్-11ను వర్తింపజేసిన తీరు చట్టబద్ధమేనా? అనే అంశాలపై ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

# పేదల కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యం



- 71 మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**దశ, పానగల్ (కోడేరు):** ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదల కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ అన్నారు. పానగల్ మండల రైతు వేదికలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన *71 మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం చెక్కులను* లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా గోవర్ధన్ సాగర్ మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు ఆర్థిక భారంగా మారకుండా ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు మాట్లాడుతూ ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో మండల ప్రభుత్వ అధికారులు, మాజీ జెడ్పీటీసీ రవి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మయ్య, పుల్లారావు, రాము యాదవ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు హేమాద్రి నాయుడు, జయరాములు, అరుణ్, ఎస్కే ఉస్మాన్, వహీద్, నగేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కరాటే గోపాల్, ప్రేమ్‌నాయక్ దర్గా, బాలరాజు, రాజవర్ధన్ నాయుడు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన డి. గిరివర్ధన్‌రెడ్డి.. నాయకుల అభినందనలు



**దశ, ఓయూ :** మేడ్చల్-మల్కాజిగిరి అర్బన్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన డి. గిరివర్ధన్‌రెడ్డిని ఉప్పల్ డివిజన్ బీజేపీ నాయకులు ఆదివారం రాత్రి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా గిరివర్ధన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల నర్సింగ్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొరిగే కృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహంకాళి లక్ష్మణ్ ముదిరాజ్, రావుల బాలకృష్ణగౌడ్, బాలచంద్ర, వెంకట్‌రావు, రాగిరి మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శైలేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా నాచారంలో బోనాల పండుగ మహోత్సవం; 100 బోనాల ఊరేగింపు

- 25 ఏళ్లుగా నాచారం విలేజ్ నుంచి బోనం సమర్పిస్తున్న కొన్నే ఇందిరమ్మ వెండి బోనంతో ఊరేగింపు..





**దశ, ఓయూ:** నాచారం విలేజ్ నుంచి గత 25 ఏళ్లుగా బోనం తీస్తూ అమ్మవారికి సమర్పిస్తున్నానని కొన్నే ఇందిరమ్మ తెలిపారు. ఆదివారం బోనాల పండుగ సందర్భంగా ప్రత్యేకంగా ఎండి బోనాన్ని అమ్మవారికి సమర్పించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా 100మంది మహిళలు బోనాలతో, 100మంది శివసత్తులతో కలిసి నాచారం మాంకాళమ్మ, ఉజ్జయిని మహంకాళి ఆలయాలకు వైభవంగా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఒగ్గు పూజారులు మల్లంపల్లి చంద్రయ్య, మల్లేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

నాచారం మాంకాళమ్మ ఆలయంలో దుర్గామాత, శివుడు, వినాయకుడు, నల్లపోచమ్మ తదితర దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించినట్లు ఇందిరమ్మ తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి అన్నీ మంచిగా జరగాలని ఆమె ఆకాంక్షించారు. 25 ఏళ్లుగా కొనసాగిస్తున్న బోనాల సమర్పణలో ఈసారి 100 బోనాలతో నిర్వహించిన ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని పేర్కొన్నారు. బోనాల కార్యక్రమంలో శోభ, శ్రీధర్, రేణుక, సంగీత, లావణ్య, సవిత, వెంకటవ్వ, లక్ష్మి, పాలకుర్తి వెంకటవ్వ, ప్రమీల, సరిత, అఖిల్, అనురాధ, ప్రకృతి, ఐలోని స్వర్ణలత, ఐలోని నరేష్, కొన్నే వెంకన్న, కొన్నే రాజ్‌కుమార్, కొన్నే మహేష్, చౌదుర్ హరీష్, చౌదుర్ మహేష్. పాలకుర్తి నర్సిరెడ్డి, నరసింహ చారి, నాగరాజు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రేయాస్‌లో ఘనంగా 12వ గ్రాడ్యుయేషన్ డే






- ఏఐ యుగానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి: సవినయ్ పట్లోల్ల

**దశ, పెద్దఅంబర్‌పేట :** తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)లో 12వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైవెల్ ఏఐ టెక్నాలజీస్, హైదరాబాద్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ సవినయ్ పట్లోల్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా సవినయ్ పట్లోల్ల మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని భవిష్యత్తుకు బలమైన పునాదిగా మలుచుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు సమాచార సాంకేతికత, కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. కొత్త టెక్నాలజీలను నేర్చుకుంటూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ అనంతుల హృదయ రెడ్డి, డాక్టర్ చింతల మేధాస్విని (ఎంబీబీఎస్), ప్రిన్సిపాల్ డాక్టర్ సి. ఉదయ్ కిరణ్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. వేడుకలకు వెయ్యికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

# అంగరంగ వైభవంగా గోల్నాకలో ఆషాడ మాస బోనాలు



**దశ ఓయూ:** ఆషాడ మాసంలో తెలంగాణ రాష్ట్రంలో జరుపుకునే బోనాల పండుగకు విదేశాలలో ఎంతో ఆదరణ ఉందని అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బోనాల పండుగ సందర్భంగా ఆదివారం గోల్నాక చర్చి లైన్ లోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బోయ రంగయ్య, ఉపాధ్యక్షుడు గొట్టాల వినోద్ కుమార్ చారి, బ్యాంక్ అధికారి పాక స్వామి, ప్రధాన కార్యదర్శి ముడారి శ్రీనివాస్, పోతరాజు సైదులు, రవీందర్, నాగుచారి, సాయి, చందు, ప్రవీణ్, నవీన్, సత్యప్రసాద్, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన ఆదివాసీ సంబురాలు

**దశ, అశ్వాపురం:** ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యంగా అశ్వాపురం మండల కేంద్రంలో ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ జేఏసీ, తుడుందెబ్బతో పాటు వివిధ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఆదివాసీలు హాజరయ్యారు. 'జల్.. జంగల్.. జమీన్' నినాదాలతో మండల కేంద్రం మార్మోగింది.



**ఆదివాసీ జెండా ఆవిష్కరణతో ప్రారంభం**

ఆదివాసీ జేఏసీ మండల అధ్యక్షుడు కల్లూరి నరసింహారావు ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్, బిర్సా ముండా తదితర మహనీయులకు నివాళులర్పించారు. ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చింతిర్యాల క్రాస్ రోడ్డు నుంచి అశ్వాపురం ప్రధాన సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సంప్రదాయ వేషధారణలు, నృత్యాలు సాగిన ర్యాలీ ఆకట్టుకుంది. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ఆదివాసీ సర్పంచులకు సన్మానం!**

ర్యాలీ అనంతరం నిర్వహించిన సభలో మండలంలోని ఆదివాసీ సర్పంచులను ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి వారు చేస్తున్న సేవలను అభినందించారు.

ఈ సందర్భంగా కల్లూరి నరసింహారావు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ఆదివాసీ ప్రాంతాలు, హక్కులకు ప్రత్యేక రక్షణ కల్పించిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఆదివాసీ అవగాహన పెంచుకోవాలని సూచించారు. అడవి, భూమి, జీవనోపాధి, స్వయం పాలన వంటి హక్కులను పరిరక్షించుకునేందుకు ఆదివాసీలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. హక్కులు పుస్తకాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

**చట్టాల అమలుపై ప్రశ్నించాలి!**

ఆదివాసీ దినోత్సవం రోజున జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ముగించడం కాకుండా 1/70 చట్టం అమలు పరిస్థితి ఏమిటనే అంశాలపై ప్రతి ఆదివాసీ ఆలోచించాలని నరసింహారావు అన్నారు. హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం అవసరమైతే ప్రభుత్వాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు చేస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఆదివాసీ సమాజ ప్రయోజనాల కోసం అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం 1982 ఆగస్టు 9న జెనీవాలో సమావేశం జరిగిందని, అనంతరం 1994లో ఐక్యరాజ్యసమితి ఆగస్టు 9ను అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంగా నిర్వహించాలని తీర్మానించిందని కార్యక్రమంలో వివరించారు. అ కార్యక్రమం అనంతరం ఆదివాసీ ప్రజలకు భోజన ఏర్పాట్లు చేశారు.

ఉదయం అల్పాహారాన్ని లైన్స్ క్లబ్ సభ్యులు అందించారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ఆదివాసీ రాజకీయ నాయకులు, ఉద్యోగులు, యువత, మహిళలు, వివిధ ఆదివాసీ సంఘాల నాయకులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యమ స్ఫూర్తి పెద్ది సుదర్శన్ రెడ్డి

❖ తాటిపర్తి జీవన్ రెడ్డి ఘన నివాళి



**దశ, జగిత్యాల:** తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్ర పోషిస్తూ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి స్మరించుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి అందించిన సేవలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలు, పోరాటాలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలను ఆయన కొనియాడారు. తెలంగాణ సాధన ఉద్యమంలో ఆయన చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

## యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన కాంగ్రెస్ కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చకీలం రాజేశ్వరరావు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పోతు భాస్కర్ ఆదేశాల మేరకు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ ఆవిర్భావం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ స్థాపించిన యువజన కాంగ్రెస్ ద్వారా ఎంతోమంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. యువజన కాంగ్రెస్‌లో పదవులు పొందిన నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు.

ప్రజల సమస్యలను స్వయంగా వారి వద్దకు వెళ్లి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. దివంగత నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి నాయకత్వంలో యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐలో పనిచేసిన నాయకులకు సముచిత స్థానం కల్పించారని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కూడా యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులకు తగిన ప్రాధాన్యం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

## కంటి ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

**దశ, సూర్యాపేట ప్రతినిధి:** కంటి ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ అవసరమైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని కౌన్సిలర్లు తన్వీర్ హుస్సేన్, బానోత్ సైదులు సూచించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కుడకుడ రోడ్డు నందు అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో, శ్రీ కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ శంకర కంటి హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు.



ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా కంటి సమస్యలు పెరుగుతున్నాయని, చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా తీవ్రమైన అనారోగ్యాన్ని నివారించవచ్చన్నారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 220 మందికి కంటి పరీక్షలు చేయగా 42 మందికి ఆపరేషన్లు అవసరం ఉన్నదని, వారిని రేపు ఉదయం హైదరాబాదుకు తీసుకెళ్ళి ఆపరేషన్ చేపిస్తామని అక్షర ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రుద్రంగి కాళిదాసు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు మందడి రమాదేవి, డాక్టర్స్ నుమాన్, అనిల్, అక్షర ఫౌండేషన్ సభ్యులు బత్తుల దామోదర్ రెడ్డి, నరాల తిరుమలరెడ్డి, షేక్ నజీర్ పాషా, గడ్డం వీరబాబు, క్యాంపు ఇంచార్జి నాయిని స్టాలిన్, రమేష్, అక్షయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ వేడుకల్లో ఐఏఎస్.. ఐపీఎస్ జోష్!

❖ సంప్రదాయ దుస్తుల్లో కలెక్టర్.. ఎస్పీ సందడి..



**దశ, ఆసిఫాబాద్:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్ లో ఘనంగా జరిగాయి. వేడుకల్లో కలెక్టర్ కె. హరిత, ఎస్పీ నీతిక పంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆదివాసీ సంప్రదాయ దుస్తులు, ఆభరణాలు ధరించి వేడుకలకు హాజరైన ఇద్దరు అధికారులు అందరినీ ఆకట్టుకున్నారు. గిరిజన పెద్దలు, మహిళలు సంప్రదాయ పద్ధతిలో కలెక్టర్, ఎస్పీలకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గిరిజన కళాకారులతో కలిసి రేలా పాటలకు స్టెప్పులేసి సంబరాల్లో జోష్ నింపారు. ఉన్నతాధికారుల సంప్రదాయ వేషధారణ, సందడి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## రోస్టర్ విధానం రద్దు చేసే వరకు పోరాటం

❖ ఎంసీఎఫ్ రాష్ట్ర నాయకులు పి. శంకర్




**దశ, కామారెడ్డి:** ఉద్యోగ నియామకాల్లో మాలలకు అన్యాయం చేస్తున్న రోస్టర్ విధానాన్ని రద్దు చేసే వరకు సంఘటితంగా పోరాటం కొనసాగించాలని మాలల కోఆర్డినేషన్ ఫోరం (ఎంసీఎఫ్) రాష్ట్ర నాయకులు పి. శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం కామారెడ్డి పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎంసీఎఫ్ కామారెడ్డి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు.రోస్టర్ విధానం కారణంగా ఉద్యోగ నియామకాల్లో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని శంకర్ ఆరోపించారు. ఈ విధానానికి వ్యతిరేకంగా గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, మాలలంతా ఐక్యంగా పోరాడి తమ రాజ్యాంగ హక్కులను సాధించుకోవాలని కోరారు.

## అంగరంగ వైభవంగా ఆషాఢ మాస బోనాలు

**దశ, ఓయూ:** ఆషాఢ మాస బోనాల సందర్భంగా నాచారం హెచ్ఎంటీ నగర్ డివిజన్ పరిధిలో మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. డప్పు, కోలాటాల నడుమ సకుటుంబ సమేతంగా అమ్మవారికి బోనం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు దేశ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించేలా చూడాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ హిందూ సంప్రదాయాలను పాటిస్తూ సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ లేబర్ సెల్ జిల్లా కన్వీనర్ యోగేశ్వర్ రెడ్డి, గందమల గోపి, నవీన్ గౌడ్, నవీన్ చింటూ, మంజుల వాణితో పాటు స్థానిక మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## రాచన్నగూడెంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

❖ ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

**దశ, ములకలపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం రాచన్నగూడెం గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసీ నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ.. అడవులు, ప్రకృతిని పరిరక్షిస్తూ ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను కాపాడుకుంటున్న ఆదివాసీల హక్కులను పరిరక్షించాలని కోరారు.ఆదివాసీలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టి, వారి సంస్కృతి, మాతృభాష, జీవన విధానం, వైద్యం, విద్య, ఉపాధి, కళలను ప్రోత్సహించాలని అన్నారు. ఆగస్టు 9ను ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి పరిరక్షణకు ప్రతీకగా భావించాలని పేర్కొన్నారు.

**ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి**

జల్-జంగల్-జమీన్ (నీరు-అడవి-భూమి) హక్కులను కాపాడాలని, ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టాన్ని సమర్థంగా అమలు చేయడంతో పాటు జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని కోరారు. ఆదివాసీ సమాజం ఐక్యంగా ముందుకు సాగి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మీడియం బాబురావు, మీడియం గోపాలరావు, కుంజా సూర్యం, మడకం మహేష్, నరేంద్ర, గడ్డం నాగరాజు, కుంజా వెంకట్, కోర్స భాస్కర్, కీసరి బాబురావు, కొండ్రు రమేష్, పోడియం రాజు, పరిశిక రమేష్ తదితరులు, యువకులు పాల్గొన్నారు.

## జోడేఘాట్లో ఘనంగా ఆదివాసీ దినోత్సవం

**ఆదివాసీ చట్టాలు, హక్కులను అమలు చేయకుంటే ఉద్యమిస్తాం**

**తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడు కోట్నాక్ విజయ్**



**దశ, ఆసిఫాబాద్:** 'జల్.. జంగల్.. జమీన్' నినాదంతో పోరాడిన అమరవీరుడు కొమురం భీం పోరాట గడ్డ జోడేఘాట్లో ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడు కోట్నక విజయ్కుమార్, కొమురం భీం మనువడు కుంరం సోనేరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత కొమురం భీం సమాధి వద్ద పూజలు నిర్వహించి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కోట్నక విజయ్కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా ఆదివాసీ గ్రామాల అభివృద్ధిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అడవులను కాపాడుతున్న ఆదివాసీలపై అటవీ అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూములను టైగర్ జోన్, టైగర్ కారిడార్ పేరుతో లాక్కోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఆదివాసీ హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో జోడేఘాట్ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆదివాసీ టైగర్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు కోట్నక కిషన్, ప్రధాన కార్యదర్శి పెందోర్ దర్ము, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పెందోర్ మారుతి, జిల్లా ముఖ్య సలహాదారు కనక ప్రభాకర్, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మాకి తుకారాం, పోరు గ్రామాల యువజన సంఘం వ్యవస్థాపకులు పెందోర్ రాజేశ్వర్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోవ ఇందిరా, ఆదివాసీ టైగర్ సేనా జిల్లా ప్రధాన కార్యదర్శి మడవీ పురుషోత్తం, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు మడపచి భీంరావు, వెంకటేష్, జిల్లా కార్యదర్శి సిడం నాగేష్, గ్రామాల పటేళ్లు, దేవారీలు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జూరాల వద్ద తగ్గిన వరద జోరు.. గేట్లు మూసివేత



**దశ, గద్వాల:** ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి క్రమంగా తగ్గుతోంది. మహారాష్ట్ర, కర్ణాటకలో వర్షాలు తగ్గడంతో ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి జూరాలకు వస్తున్న వరద ప్రవాహం తగ్గినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 80 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 39,608 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం తగ్గడంతో ప్రాజెక్టు గేట్లను మూసివేసినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు జూరాల ప్రాజెక్టులో ఆరు విద్యుత్ ఉత్పత్తి యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుతం 317.51 మీటర్లుగా నమోదైంది. జూరాల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.663 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. వరద ప్రవాహం మరింత తగ్గే అవకాశం ఉండటంతో ప్రాజెక్టు పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# నాణ్యత తిలోదకాలు!

**మొదటి పేజీ తరువాయి**

బదులు డస్ట్ వినియోగిస్తున్నారని, పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు రూ.6 కోట్ల నుంచి రూ.10 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ట్రంక్‌లైన్ భవిష్యత్‌లో ప్రాంతంలోని మురుగు నీటి నిర్వహణకు కీలకంగా మారనుంది. అయితే ఇలాంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాల నిర్మాణంలోనే నాణ్యత విషయంలో రాజీ పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ట్రంక్‌లైన్ నిర్మాణంలో అవసరమైన చోట నాణ్యమైన నిర్మాణ సామగ్రిని వినియోగించాల్సి ఉండగా.. పనులు జరుగుతున్న తీరును పరిశీలిస్తే ఇసుకకు బదులుగా డస్ట్ వినియోగిస్తున్నట్లు కనిపిస్తోందని స్థానికులు అంటున్నారు. నిర్మాణ పనుల్లో ఉపయోగిస్తున్న మెటీరియల్ నాణ్యతపై అధికారులు వెంటనే సాంకేతికంగా పరిశీలన చేయాలని వారు కోరుతున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మిస్తున్న ప్రాజెక్టులో నాసిరకం పనులు జరిగితే భవిష్యత్‌లో పైపులు, జాయింట్లు, ఇతర నిర్మాణ భాగాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తర్వాత మరమ్మతుల పేరుతో మళ్లీ ప్రజాధనం ఖర్చు చేయాల్సిన పరిస్థితి రావచ్చని చెబుతున్నారు.

### పర్యవేక్షణ ఎక్కడ?

భారీ వ్యయంతో పనులు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో పనులను ఎంతవరకు పర్యవేక్షిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంట్రాక్టర్ వినియోగిస్తున్న నిర్మాణ సామగ్రి నాణ్యతను పరిశీలిస్తున్నారా? పనుల ప్రతి దశను అధికారులు నమోదు చేస్తున్నారా? నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నారా? అన్నది ప్రశ్నార్థకంగా మారిందని స్థానికులు అంటున్నారు.



అధికారుల పర్యవేక్షణ లోపిస్తే కాంట్రాక్టర్ తనకు అనుకూలంగా పనులు చేసే అవకాశం ఉంటుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనంతో చేపట్టే పనుల్లో కాంట్రాక్టర్ కంటే సంబంధిత అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

### నాణ్యత పరీక్షలు జరిగాయా?

ట్రంక్‌లైన్ పనుల్లో ఉపయోగిస్తున్న మెటీరియల్, పైపుల నాణ్యత, బెడ్డింగ్, జాయింట్లు, లెవెల్స్, నిర్మాణ పద్ధతి తదితర అంశాలపై ఇప్పటివరకు ఎన్ని నాణ్యత పరీక్షలు నిర్వహించారనే విషయాన్ని అధికారులు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. పనుల్లో నాణ్యత లోపాలు ఉన్నట్లు తేలితే వాటిని సరిచేసిన తర్వాతే సంబంధిత బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనానికి నష్టం కలిగేలా పనులు జరిగితే కాంట్రాక్టర్‌తో పాటు పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### పని పూర్తయ్యాక కాదు.. ఇప్పుడే తనిఖీ చేయాలి

ట్రంక్‌లైన్ సాధారణ నిర్మాణ పని కాదని స్థానికులు చెబుతున్నారు. భవిష్యత్‌లో వేలాది కుటుంబాలకు మురుగు నీటి నిర్వహణకు ఉపయోగపడే కీలక మౌలిక సదుపాయం కావడంతో నిర్మాణంలో ప్రతి దశలో నాణ్యతను నిర్ధారించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. పని పూర్తయిన తర్వాత లోపాలు గుర్తించడం కంటే.. నిర్మాణం జరుగుతున్న సమయంలోనే అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. నాణ్యతపై స్వతంత్ర సాంకేతిక తనిఖీ నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నారు.

### అధికారులు స్పందిస్తారా?

కోట్ల రూపాయలతో జరుగుతున్న ఈ పనులపై వస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. నిర్మాణంలో నిబంధనలు పాటిస్తున్నారా? ఉపయోగిస్తున్న మెటీరియల్ ప్రమాణాలకు అనుగుణంగా ఉందా? పనులను ఎవరు పర్యవేక్షిస్తున్నారు? నాణ్యత పరీక్షలు ఎప్పుడు నిర్వహించారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల సొమ్ముతో నిర్మిస్తున్న ట్రంక్‌లైన్ నాణ్యతతో పూర్తవుతుందా? లేక ఆరోపణల మధ్యే పనులు కొనసాగుతాయా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ విషయమై సర్కిల్ ఇంజనీరింగ్ డిఈ ని వివరణ కోరేందుకు జ్వాలా దశ ప్రతినిధి ఫోన్ లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి
# కేసీఆర్ భరోసా..
## రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం

**దశ, వరంగల్:** తెలంగాణ ఉద్యమ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం పరామర్శించారు. నల్లబెల్లిలోని పెద్ది స్వగృహానికి చేరుకున్న కేసీఆర్.. తొలుత పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కేసీఆర్ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. పెద్ది కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు. పార్టీ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున రూ.2 కోట్లు, ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం రూ.25 లక్షలు అందించాలని ఇప్పటికే నిర్ణయించిన మేరకు సంబంధిత పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. పెద్ది పిల్లల భవిష్యత్తు, చదువు, కుటుంబ సంక్షేమాన్ని పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ అనంతరం జిల్లా పార్టీ ముఖ్యులు సమావేశమై కుటుంబానికి అందించాల్సిన ఇతర సంక్షేమ కార్యక్రమాలపై నిర్ణయం తీసుకుంటారని బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. కేసీఆర్ నల్లబెల్లికి వస్తున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు దారిపొడవునా ఆయనకు సంఘీభావం తెలిపారు. పలుచోట్ల కేసీఆర్ తన కాన్వాయ్‌ను ఆపి కార్యకర్తలను పలకరించి ధైర్యం చెప్పారు.

# వృద్ధులే టార్గెట్

**మొదటి పేజీ తరువాయి**

అవగాహన కార్యక్రమాలతో నెలకు సగటున నమోదయ్యే కేసులు 24 నుంచి 17కు తగ్గాయని తెలిపారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి, సొమ్ము రికవరీకి సైబర్ క్రైమ్ పోలీసులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారని సజ్జనార్ తెలిపారు. వృద్ధుల ఫోన్ వినియోగం, బ్యాంకు లావాదేవీలపై కుటుంబ సభ్యులు పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.

# రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని పూజలు

**మొదటి పేజీ తరువాయి**

పోచమ్మ అమ్మవారిని కూడా కేటీఆర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కేటీఆర్‌ను శాలువాతో సత్కరించారు.

# మెడికో ప్రియాంక మృతి..

**హైదరాబాద్:** రాజమహేంద్రవరం ఘటనలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థిని ప్రియాంక మృతిచెందారు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందినట్లు సికింద్రాబాద్ కిమ్స్ వైద్యులు ధ్రువీకరించారు. ఆదివారం మధ్యాహ్నం 3.25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్లు వెల్లడించారు. కిమ్స్‌లో ఉన్న ప్రియాంక మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించనున్నారు. రాజమహేంద్రవరం పోలీసులు, ప్రియాంక తండ్రి వెంకటేశ్ వచ్చిన తర్వాత పోస్టుమార్టం నిర్వహించనున్నారు. ప్రియాంక స్వస్థలం జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఏక్లాస్‌పూర్. ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆమె.. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్‌ఎల్ వైద్య కళాశాలలో డెర్మటాలజీ విభాగంలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ప్రియాంక ఈ నెల 3న రాత్రి రాజమహేంద్రవరం ప్రసాద్ ఆదిత్యమాల్‌లో సినిమా చూసి, సహచర విద్యార్థి ఉమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. రద్దీ కారణంగా వాహనాలు థియేటర్ గేటు వద్ద ఆగగా.. అదే సమయంలో నామవరానికి చెందిన సురవరపు దుష్యంత్, లాలాచెరువుకు చెందిన ఆండ్రూ విలియం జోసెఫ్‌లు మద్యం మత్తులో కారు వేగంగా నడుపుతూ వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టారు. తరువాత మరో రెండుసార్లు బలంగా ఢీకొట్టి.. పైనుంచి కారు వెళ్లడంతో కిందపడిపోయిన ప్రియాంక తలకు తీవ్ర గాయమైంది. ఆమెను స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు.

# రెంట్ బాయ్‌ఫ్రెండ్ ట్రాప్

**మొదటి పేజీ తరువాయి**




ఆకర్షణీయమైన పోస్టర్లు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కాఫీ మీటింగ్‌కు రూ.499, సినిమా డేట్‌కు రూ.1,249, షాపింగ్‌కు తోడుగా రావడానికి రూ.1,499, ఈవెంట్లు లేదా పెళ్లిళ్లకు తోడుగా రావడానికి రూ.1,999 అంటూ రకరకాల ప్యాకేజీలను ప్రచారం చేస్తున్నారని సీపీ తెలిపారు. గోప్యత, భద్రత పూర్తిగా ఉంటుందని, ఇది ఎలాంటి అక్రమ వ్యాపారం కాదంటూ నమ్మబలికి బుకింగ్ కోసం డైరెక్ట్ మెసేజ్ చేయాలని కోరుతున్నారని చెప్పారు. ఏఐతో రూపొందించిన లేదా ఇంటర్నెట్ నుంచి సేకరించిన అందమైన యువకుల ఫొటోలను ప్రొఫైల్ పిక్చర్లుగా పెట్టుకుని అమ్మాయిలతో పరిచయం పెంచుకుంటున్నారని సజ్జనార్ వివరించారు. ఆ తర్వాత బుకింగ్ కన్ఫర్మేషన్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ చెల్లింపు పేరుతో డిజిటల్ వాలెట్లు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా డబ్బులు వసూలు చేసి అకౌంట్లను బ్లాక్ చేస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియాలో పరిచయమైన అపరిచితులను నమ్మి నేరుగా కలవడానికి వెళ్లడం ప్రమాదకరమని సీపీ హెచ్చరించారు. ప్రేమ, స్నేహం పేరుతో తియ్యటి మాటలు చెప్పి మోసం చేసే అవకాశం ఉందన్నారు. ఇలాంటి మోసపూరిత ప్రకటనలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారని, బాధ్యులపై దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అమ్మాయిలు, యువతులతో పాటు తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. పిల్లలు సోషల్ మీడియాలో ఎలాంటి కంటెంట్ చూస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనే విషయాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని, అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# మావోయిజం దాదాపు అంతం

**మొదటి పేజీ తరువాయి**

సీవీ ఆనంద్.. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం పరిస్థితుల్లో గణనీయమైన మార్పు వచ్చిందన్నారు.

### రాజకీయ నేతల భద్రతపై..

మావోయిస్టుల సమస్య తగ్గడంతో అన్ని రాష్ట్రాల్లో మాదిరిగానే తెలంగాణలోనూ రాజకీయ నాయకులకు భద్రతను తగ్గించినట్లు డీజీపీ తెలిపారు. గన్‌మెన్‌లను తగ్గించడంపై కొందరు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. అయితే పూర్తి భద్రతను తొలగించలేదని, భద్రతా కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే భద్రతను పునఃసమీక్షించినట్లు స్పష్టం చేశారు.

### మాదక ద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి

ప్రధాన సమస్యగా మాదక ద్రవ్యాల వ్యాప్తిని గుర్తించామని సీవీ ఆనంద్ తెలిపారు. డ్రగ్స్ నివారణకు కొత్త వ్యూహాలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ శాఖలో పలు మార్పులు చేస్తున్నామని చెప్పారు. గ్రేహౌండ్స్‌తో పాటు మరికొన్ని పోలీసు విభాగాల్లో మార్పులు చేపడతామని, పోలీస్ డిపార్ట్‌మెంట్ మొత్తాన్ని సంస్కరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని డీజీపీ పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లలో సాధారణ విధులు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

# కూతురి కాపురం కోసం నిలదీసిన తల్లి.. అల్లుడి చేతిలో హత్య

**దశ, సత్తుపల్లి:** కూతురి జీవితం బాగుండాలని ఆ తల్లి కోరుకుంది. భర్త మరో మహిళతో కొనసాగిస్తున్న వివాహేతర సంబంధం వల్ల తన కూతురు పడుతున్న బాధను చూసి అల్లుడిని పలుమార్లు మందలించింది. పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టించి, కాపురాన్ని చక్కదిద్దుకోవాలని సూచించింది. కానీ అదే తల్లి చివరకు అల్లుడి కళ్లలో తన సంబంధానికి అడ్డుగా మారింది. అడ్డు తొలగించుకోవాలనే దారుణ ఆలోచనతో అల్లుడు, అతని ప్రియురాలు కలిసి ఆమెను హత్య చేసిన ఘటన సత్తుపల్లి మండలం తుంబూరులో తీవ్ర విషాదాన్ని నింపింది. తుంబూరు గ్రామానికి చెందిన వెదుల్ల తిరుపతిరావు సుమారు 30 ఏళ్ల క్రితం వెంకట నరసమ్మ పెద్ద కుమార్తె మంగమ్మను ప్రేమ వివాహం చేసుకున్నాడు. కరెంటు పనులు చేసుకుంటూ జీవించే తిరుపతిరావు.. మరోవైపు అదే గ్రామానికి చెందిన వివాహిత మహిళ సునీతతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. భర్త



తీరుతో మంగమ్మ తీవ్రంగా బాధపడింది. విషయం తెలుసుకున్న ఆమె తల్లి వెంకట నరసమ్మ అల్లుడిని పలుమార్లు హెచ్చరించింది. కూతురికి అన్యాయం చేయొద్దని, మరో మహిళతో సంబంధాన్ని వదులుకోవాలని చెప్పింది. అయినా తిరుపతిరావులో మార్పు రాకపోవడంతో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టించింది. కూతురి కాపురం కోసం తల్లి చేసిన ఈ ప్రయత్నమే చివరకు ఆమెకు ప్రాణాంతకంగా మారింది. పంచాయతీ జరిగిన రెండు రోజులకే.. ఆగస్టు 2 రాత్రి వెంకట నరసమ్మ కనిపించకుండా పోయింది. దీంతో ఆందోళనకు గురైన ఆమె కుమార్తె మంగమ్మ ఆగస్టు 3న సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో పోలీసులు సేకరించిన ఆధారాలు, ప్రశ్నించడంతో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. వివాహేతర సంబంధానికి వెంకట నరసమ్మ అడ్డుగా మారిందని భావించిన తిరుపతిరావు.. తన ప్రియురాలు సునీతతో కలిసి ఆమెను హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు ఆగస్టు 2 అర్ధరాత్రి సమయంలో ఇద్దరూ వెంకట నరసమ్మ ఇంటికి వెళ్లి.. ఆమె టీవీ చూస్తున్న సమయంలో చీర కొంగుతో ఉరిబిగించి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని బైక్‌పై తీసుకెళ్లి గ్రామ శివారులో రోడ్డు పక్కన పడేసి పెట్రోల్ పోసి తగలబెట్టేందుకు ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. మృతదేహం పూర్తిగా కాలకపోవడంతో మరుసటి రోజు కూడా అక్కడికి వెళ్లి చెత్త, కొబ్బరి మట్టలు వేసి మళ్లీ తగలబెట్టినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మిగిలిన శరీర భాగాలను మరోచోటికి తరలించి కాల్చినట్లు వెల్లడించారు. అంతా చేసిన తర్వాత ఏమీ తెలియనట్లు కుటుంబ సభ్యుల మధ్య తిరుగుతూ నిందితులు వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. అయితే వెంకట నరసమ్మ అదృశ్యంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆధారాలను సేకరించి నిందితులను విచారించడంతో అసలు విషయం బయటపడింది. ఈ కేసులో తిరుపతిరావుతో పాటు అతని ప్రియురాలు సునీతను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com